


## 25-07-2010

# త్రిత్వము తరువాతి ఎనిమిదవ ఆదివారము

**21** త్రిత్వమునకు స్తుతి

రా - కాంభోజి (వా॥యః యేసు నీ నామామృతము) తా - ఆది

త్రిత్వమై నిత్యత్వమున నే - కత్వమగు దేవా - నీ = సత్యసామర్థ్యత్వముల

నిజ - తత్వము గణించి నిను నిత్యము స్తుతించెదను ॥త్రిత్వమై॥

1. ఎల్లలోకంబుల సృజించిన - చల్లని తండ్రి - నా = యుల్లమున నీ గొప్ప వింత

- లెల్ల సంతసిల్ల శో - భిల్లఁ దలంచెదను ॥త్రిత్వమై॥

2. వాసి కెక్కిన పరమరాజ్యని - వాసమును విడిన - శ్రీ = యేసునాథుం

డను కుమారా దోషుల దోసంబులెల్లఁ - గాచి రక్షించినావు ॥త్రిత్వమై॥

3. ఆదరణకారుండ వగు శు - ద్ధాత్ముడా దేవా - యా = మోద నామము

నంపఁబడి యేసు - నాథుని సుబోధ లెల్ల - బోధపరచి పాదుకొల్పు

॥త్రిత్వమై॥

4. ఓపితా సుతా శుద్ధాత్మ - ఒక్క దేవుఁడవు - ఎల్ల - పాపులను రక్షింప

మిగుల - నోపికతో నాపదలు - బాపి కృపఁ జూపినావు ॥త్రిత్వమై॥

**(సభ నిలువబడి యుండగ బోధకుడు చెప్పవలసినది)**

బో :-	తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున.

సభ :-	ఆమేన్

(దా.కీ.43 : 3-4)

బో:-నీ వెలుగును నీసత్యమును బయలుదేర జేయుము;అవినాకు త్రోవచూపును .అవి నీ పరిశుద్ధ పర్వతమునకును, నీ నివాస స్థలమునకును నన్ను తోడుకొని వచ్చును. అప్పుడు నేను దేవుని బలిపీఠమునొద్దకు నాకు ఆనంద సంతోషములు కలుగ జేయు దేవుని యొద్దకు చేరుదును. దేవా, నాదేవా, సితారా వాయించుచు నీకు కృతాజ్ఞతాస్తుతులు చెల్లించెదను.

**పాపపుటొప్పదల**

బో :- ప్రభువునందు ప్రియులారా! యథార్ధ హదయముతో మన తండ్రియైన దేవుని సమీపించి, ఆయన యెదుట మన పాపముల నొప్పుకొని, మన ప్రభువైన యేసు క్రీస్తు పేరిట మనకు క్షమాపణ దయచేయుమని వేడుకొందము.

**అందరు మోకరించి లేక నిలువబడి ఉండవలెను.**

బో :-	ప్రభువు నామమువలననే మనకు సాహయ్యము కలుగుచున్నది.

సభ :-	భూమి ఆకాశములను సృజించినవాడు ఆయనే.

బో :-	ప్రభువు సన్నిధిని నా యతిక్రమములు నే నొప్పుకొందుననుకొంటిని.

సభ :-	నీవు నా పాప దోషము పరిహరించియున్నావు.

బో :- మాసృష్టికర్తవు విమోచకుడవైన సర్వశక్తిగల దేవా దీనులము పాపులము అగు మేము స్వాభావికముగా పాపులమనియు, అపవిత్రులమనియు, తలంపు వలన, మాటవలన, క్రియవలన నీకు విరోధముగా పాపము చేసితిమనియు నీ యెదుట ఒప్పుకొనుచున్నాము; కావున మేము మా ప్రభువైన యేసుక్రీస్తు నిమిత్త

మున నీకృపను వెదకుచు వేడుకొనుచు మితిలేని కనికరము గల నీ యొద్దకు ఆశ్రయముకై వచ్చుచున్నాము.

**సభ బోధకునితో కలిసి ఇట్లు చెప్పవలెను :**

మా కొరకు చనిపోవుటకై నీ జనితైక కుమారునిచ్చిన మిగుల కరుణగల దేవా! మమ్మును కనికరించి, ఆయన నిమిత్తమున మాసమ్త పాపములకు క్షమాపణ దయచేయుము. మేము నీకృపచేత నిత్యజీవము పొందునట్లు, నిన్ను గూర్చియు నీచిత్తమును గూర్చియు సరియైన జ్ఞానమును, నీవాక్యమునకు తగిన విధేయతను మాయందు నీపరిశుద్ధాత్మవలన వృద్ధిపొందింపుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము ఆమేన్.

బో :-మన పరలోకపు తండ్రియగు సర్వశక్తిగల దేవుడు మనలను కనికరించి, మనకొరకు చనిపోవుటకై తన యేక కుమారునిచ్చి, ఆయన మూలమున మన పాపములన్నిటిని క్షమించుచున్నాడు. ఆయననామమందు విశ్వాసముంచు వారికి దేవుని కుమారులగుటకు అధికారమిచ్చును, వారికి తన పరిశుద్ధాత్మ ననుగ్రహించును. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. ఓప్రభువా! ఈ రక్షణను మాయందరికి దయచుయుము.

సభ :- ఆమేన్

## తిత్వము తరువాతి ఎనిమిదవ ఆదివారము కొరకు ఏర్పరచబడిన సంకీర్తన

### కీర్తన 71

1 యెహోవా, నేను నీ శరణుజొచ్చియున్నాను; నన్నెన్నడును సిగ్గుపడనియ్యకుము.

2 నీ నీతినిబట్టి నన్ను తప్పింపుము నన్ను విడిపింపుము. నీ చెవియొగ్గి నన్ను రక్షింపుము.

3 నేను నిత్యము చొచ్చునట్లు నాకు ఆశ్రయదుర్గముగా ఉండుము; నా శైలము నా దుర్గము నీవే
నీవు నన్ను రక్షింప నిశ్చయించియున్నావు.

4 నా దేవా, భక్తిహీనుల చేతిలోనుండి నన్ను రక్షింపుము; కీడు చేయువారి పట్టులోనుండి బలాత్కారుని ప
ట్టులోనుండి నన్ను విడిపింపుము

5 నా ప్రభువా యెహోవా, నా నిరీక్షణాస్పదము నీవే; బాల్యమునుండి నా ఆశ్రయము నీవే.

6 గర్భవాసినైనది మొదలుకొని నీవే నాకు ప్రాపకుడవైయుంటిని; తల్లిగర్భమునుండి నన్ను ఉద్భవింపజేసి
నవాడవు నీవే. నిన్నుగూర్చి నేను నిత్యము స్తుతిగానము చేయుదును.
7 నేను అనేకులకు ఒక వింతగా ఉన్నాను; అయినను నాకు బలమైన ఆశ్రయము నీవే.
8 నీ కీర్తితోను నీ ప్రభావవర్ణనతోను దినమంతయు నా నోరు నిండియున్నది
9 వృద్ధాప్యమందు నన్ను విడనాడకుము; నా బలము క్షీణించినప్పుడు నన్ను విడువకుము.
10 నా శత్రువులు నన్నుగూర్చి మాటలాడుచున్నారు; నా ప్రాణముకొరకు పొంచియున్నవారు కూడి ఆలోచ
న చేయుచున్నారు.
11 -దేవుడు వానిని విడిచెను తప్పించువారెవరును లేరు; వానిని తరిమి పట్టుకొనుడి అని వారనుకొనుచు
న్నారు
12 దేవా, నాకు దూరముగా ఉండకుము; నా దేవా, నా సహాయమునకు త్వరపడి రమ్ము
13 నా ప్రాణవిరోధులు సిగ్గుపడి నశించుదురు గాక; నాకు కీడుచేయ జూచువారు నిందపాలై మానభంగ
ము నొందుదురు గాక.
14 నేను ఎల్లప్పుడు నిరీక్షింతును; నేను మరి యెక్కువగా నిన్ను కీర్తింతును
15 నీ నీతిని నీ రక్షణను నా నోరు దినమెల్ల వివరించును; అవి నాకు ఎన్నశక్యము కావు.
16 ప్రభువైన యెహోవాయొక్క బలవత్కార్యములను బట్టి నేను వర్ణింప మొదలుపెట్టెదను
నీ నీతినిమాత్రమే నేను వర్ణించెదను.
17 దేవా, బాల్యమునుండి నీవు నాకు బోధించుచు వచ్చితివి; ఇంతవరకు నీ ఆశ్చర్యకార్యములు నేను తెలు
పుచునే వచ్చితిని
18 దేవా, వచ్చుతరమునకు నీ బాహుబలమును గూర్చియు; పుట్టబోవువారికందరికి నీ శౌర్యమును గూర్చి
యు నేను తెలియజెప్పునట్లు తల నెరసి వృద్ధునైయుండు వరకు నన్ను విడువకుము.
19 దేవా, నీ నీతి మహాకాశమంత ఉన్నతమైనది; గొప్ప కార్యములు చేసిన దేవా, నీతో సాటియైన
వాడెవడు?
20 అనేకమైన కఠినబాధలను మాకు కలుగజేసినవాడా, నీవు మరల మమ్ము బ్రదికించెదవు
భూమియొక్క అగాధ స్థలములలోనుండి నీవు మరల మమ్ము లేవనెత్తెదవు.
21 నా గొప్పతనమును వృద్ధిచేయుము; నా తట్టు మరలి నాకు నెమ్మది కలుగజేయుము
22 నా దేవా, నేనుకూడ నీ సత్యమునుబట్టి; స్వరమండల వాద్యముతో నిన్ను స్తుతించెదను
ఇశ్రాయేలు పరిశుద్ధదేవా, సితారాతో నిన్ను కీర్తించెదను
23 నేను నిన్ను కీర్తించునప్పుడు నా పెదవులు, నీవు విమోచించిన నా ప్రాణమును నిన్నుగూర్చి ఉత్సాహ
ధ్వని చేయును
24 నాకు కీడు చేయజూచువారు సిగ్గుపడియున్నారు; వారు అవమానము పొందియున్నారు
కాగా నా నాలుక దినమెల్ల నీ నీతిని వర్ణించును.

తండ్రికిన్, కుమారునికన్, పరిశుద్ధాత్మకును ఆదియందు,ఇప్పుడు, ఎల్లప్పుడు , యుగయుగము లందునట్లు మహిమ కలుగునుగాక, ఆమేన్.

## ప్రభుని కనికరము

## (లూకా 18:35-43)

బో :- ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ :- ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో :- క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

సభ :- క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

బో :- ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ :- ప్రభువా, మమ్మును కనికరింపుము.

## సర్వోన్నతుని మహిమ

## (లూకా 2:14)

బో :- సర్వోన్నతమైన వానిలో దేవునికి మహిమ

కలుగునుగాక - దేవునికి మహిమకలుగునుగాక - కలుగునున్నతమైన - ఘనస్థలములందున - ఇలకు సమాధానం - నరుల కాయన దయ॥

ప్రభువైన దేవా - పరమరాజా - సర్వపరిపాలా - పరిపూర్ణ శక్తిగల - పరమ జనక నిన్ను - మహిని స్తుతించుచు = మరి పొగడుచున్నాము ॥

మహిమపర్చుచు-ఆరాధించు-చున్నాము నిన్ను=మహిమాతి శయమును- మది దలంచియు నీకు-మహిని మా స్తుతి కృత = జ్ఞత నిచ్చుచున్నాము॥

.ఏక కుమారా-యేసుప్రభువా - యెహోవా - తనయా - లోకపాపము మోయు - ఏకదేవుని గొర్రె - పిల్ల! మమ్మును కనిక -రించుము చల్లగ॥

పరిశుద్ధుడవు-ప్రభుడవు నీవు ప్రభవైన క్రీస్తు= పరి శుద్ధాత్మతోతండ్రియైన దేవునియందు - పరిపూర్ణ మహిమతో = ప్రబలుచున్నావెపుడు ॥ ఆమేన్ ॥

బో :- ప్రభువు మీతోనుండుగాక (లూకా 1:28)

సభ :-	మీ యాత్మతో నుండుగాక (2తిమో 4:22)
బో :-	ప్రార్థింతుము.

సభ :-	ఆమేన్

**బో:-	తిత్వము తరువాతి ఎనిమిదవ ఆదివారము కొరకు ఏర్పరచబడిన**

**పాత నిబంధన పాఠము నిర్గ. 3: 1-14**

## అగ్ని జ్వాలలో మండుచున్న పొద

1 మోషే మిద్యాను యాజకుడైన యిత్రో అను తన మామ మందను మేపుచు, ఆ మందను అరణ్యము
అవతలకు తోలుకొని దేవుని పర్వతమైన హోరేబుకు వచ్చెను. 2 ఒక పొద నడిమిని అగ్ని జ్వాలలో
యెహోవా దూత అతనికి ప్రత్యక్షమాయెను. అతడు చూచినప్పుడు అగ్ని వలన ఆ పొద మండుచుండెను.
గాని పొద కాలిపోలేదు. 3 అప్పుడు మోషే- ఆ పొద యేల కాలిపోలేదో నేను ఆ తట్టు వెళ్లి యీ గొప్ప
వింత చూచెదననుకొనెను. 4 దానిని చూచుటకు అతడు ఆ తట్టు వచ్చుట యెహోవా చూచెను. దేవుడు ఆ
పొద నడుమనుండి - మోషే మోషే అని అతనిని పిలిచెను. అందుకతడు - చిత్తము ప్రభువా అనెను .
5 అందుకాయన - దగ్గరకు రావద్దు, నీ పాదముల నుండి నీ చెప్పులు విడువుము, నీవు నిలిచియున్న
స్థలము పరిశుద్ధ ప్రదేశము అనెను. 6 మరియు ఆయన - నేను నీ తండ్రి దేవుడను, అబ్రాహాము
దేవుడను ఇస్సాకు దేవుడను యాకోబు దేవుడను అని చెప్పగా మోషే తన ముఖమును కప్పుకొని దేవుని
వైపు చూడ వెరచెను.

## ఇశ్రాయేలీయులను విడిపించుటకు మోషే

7 మరియు యెహోవా యిట్లనెను. - నేను ఐగుప్తులో నున్న నా ప్రజల బాధను నిశ్చయముగా చూచి
తిని, పనులలో తమ్మును కష్టపెట్టువారిని బట్టివారు పెట్టిన మొరను వింటిని, వారి దుఃఖములు నాకు
తెలిసే యున్నవి. 8 కాబట్టి ఐగుప్తీయుల చేతిలోనుండి వారిని విడిపించుటకును, ఆ దేశములో నుండి
విశాలమైన మంచి దేశమునకు, అనగా కనానీయులకు హిత్తీయులకు అమోరీయులకు పెరిజ్జీయులకు
హివ్వీయులకు యెబూసీయులకు నివాస్థానమై, పాలు తేనెలు ప్రవహించు దేశమునకు వారిని నడిపించుట
కును దిగివచ్చి యున్నాను. 9 ఇశ్రాయేలీయుల మొర నిజముగా నాయొద్దకు చేరినది, ఐగుప్తీయులు
వారిని పెట్టుచున్న హింస చూచితిని. 10 కాగా రమ్ము, నిన్ను ఫరో యొద్దకు పంపెదను; ఇశ్రాయేలీ
యులైన నా ప్రజలను నీవు ఐగుప్తులో నుండి తోడుకొని పోవలెననెను.

## నేను ఉన్నవాడను - దేవుడు

11 అందుకు మోషే - నేను ఫరో యొద్దకు వెళ్లుటకును, ఇశ్రాయేలీయులను ఐగుప్తులో నుండి తోడుకొని
పోవుటకును ఎంతటివాడనని దేవునితో అనగా 12 ఆయన - నిశ్చయముగా నేను నీకు తోడైయుం
దును, నేను నిన్ను పంపితిననుటకు ఇది నీకు సూచన; నీవు ఆ ప్రజలను ఐగుప్తులోనుండి తోడుకొని

వచ్చిన తరువాత మీరు ఈ పర్వతము మీద దేవుని సేవించెదరనెను. 13 మోషే – చిత్తగించుము;
నేను ఇశ్రాయేలీయుల యొద్దకు వెళ్లి వారిని చూచి – మీ పితరుల దేవుడు మీయొద్దకు నన్ను పంపె
నని వారితో చెప్పగా వారు – ఆయన పేరేమి అని అడిగిన యెడల వారితో నేనేమి చెప్పవలెనని
దేవుని నడిగెను. 14 అందుకు దేవుడు – నేను ఉన్నవాడను అను వాడనై యున్నానని మోషేతో
చెప్పెను. మరియు ఆయన – ఉండునను వాడు మీయొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో
చెప్పవలెననెను.

సభ :– పరిశుద్ధడవగు దేవా!పావనశక్తుడ దేవా!పావన అమర్త్యదేవా!మమ్మును కనికరింపుము.

**బో :** తిత్వము తరువాతి ఎనిమిదవ ఆదివారము కొరకు ఏర్పరచబడిన పత్రిక పాఠము–రోమా 8: 12–17;

## దేవుని కుమారుడు

12 కాబట్టి సహోదరులారా, శరీరానుసారముగా ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్థులము
కాము. 13 మీరు శరీరాను సారముగా ప్రవర్తించిన యెడల చావవలసిన వారై యుందురు గాని, ఆత్మ
చేత శారీరక క్రియలను చంపినయెడల జీవించెదరు. 14 దేవుని ఆత్మ చేత ఎందరు నడిపింప బడుదురో
వారందరు దేవుని కుమారులై యుందురు. 15 ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను
పొంద లేదు గాని, దత్త పుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము – అబ్బా, తండ్రీ, అని
మొఱ్ఱ పెట్టుచున్నాము. 16 మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చు
చున్నాడు. 17 మనము పిల్లలమైతే వారసులము అనగా, దేవుని వారసులము. క్రీస్తుతో కూడ మహిమ
పొందుటకు ఆయనతో శ్రమ పడిన యెడల, క్రీస్తు తోడి వారసులము.

ఇంతటితో ఈ దినము కొరకైన పత్రికవాక్యము ముగియుచున్నది.

సభ :– హల్లెలూయా, హల్లెలూయా, హల్లెలూయా

.బో:– తిత్వము తరువాతి ఎనిమిదవ ఆదివారము కొరకు ఏర్పరచబడిన సువార్త పాఠము–మత్తయి 7: 15–23

**సభనిలువబడి** :– ఓ ప్రభువా! నీకు మహిమ కలుగునుగాక.

## అబద్ధ ప్రవక్తలు

*(లూకా 6:32–44)*

15 “అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొఱ్ఱెల చర్మములు
వేసికొని మీ యొద్దకు వత్తురు కాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళు. 16 వారి
ఫలముల వలన మీరు వారిని తెలిసి కొందురు. ముండ్ల పొదలలో ద్రాక్ష పండ్ల
నైనను, పల్లేరు చెట్లకు అంజూరపు పండ్లనైనను కోయుదురా? 17 అలాగునే
ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు కాని ఫల
ములు ఫలించును.! 18 మంచి చెట్టు కానిఫలములు ఫలింపనేరదు, పనికి
మాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు. 19 మంచి ఫలములు ఫలింప
ని ప్రతిచెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. 20 కాబట్టి మీరు వారి ఫలము
వలన వారిని తెలిసికొందురు..”

## తండ్రి చిత్తము

*(లూకా 13:25-27, 6:47-49)*

21 “ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్య
ములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువా
డే ప్రవేశించును. 22 ఆ దినమందు అనేకులు నన్ను చూచి-ప్రభువా, ప్రభువా,
మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్ట
లేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు.
23 అప్పుడు-నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా,
నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును.

ఇంతటితో ఈ దినముకైన సువార్త వాక్యముముగియుచున్నది.

సభ :- ఓ క్రీస్తూ! నీకు స్తోత్రము కలుగునుగాక

**అందరు :-** **కీర్తన**

**అపోస్తలుల విశ్వాసప్రమాణము (మత్తయి 28:19)**

భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను. ఆయన ఏకకుమారుడును మనప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమును ధరింపబడి కన్యయైన మరియకు పుట్టి పొంతి పిలాతు అధికారము క్రింది శ్రమపడి సిలువవేయబడి చనిపోయి సమాధి చేయబడెననియు, ఆదృశ్యలోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలోనుండి మూడవదినమున తిరగిలేచి పరలోకమునకెక్కి సర్వశక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు సజీవులకును, మృతులకును,తీర్పుచేయుటకు అక్కడనుండి వచ్చుననియు, నమ్ముచున్నాను.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను, పరిశుద్ధ క్రైస్తవసంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాపక్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును ఉన్నవని నముచున్నాను. ఆమేన్.

## కీర్తన

## 413 యేసు తోడైయున్నఁ జాలును

రా – బిలహరి తా –త్రిపుట

నీవు తోడై యున్నఁజాలు – యేసు – నిత్యము నాకది మేలు = నీవు ధరణినుండు – నీచపాపుల నెల్లఁగావఁ బ్రేమ వచ్చి – ఘన ప్రాణ మిడినట్టి ॥నీవు॥

1. నినుఁ బోలు రక్షకుం డేడి – క్రీస్తు – ననుఁ బోలు పాతకుం డేడి = నిను నమ్ము వారలకు – నీ వొసఁగుచుందువు – తనరఁ పాపక్షమ – దయచేత నిలలోన॥నీవు॥
2. నీ పాటి బలవంతుఁ డేడి – ప్రభు – నాపాటి దుర్బలుం డేడి = కాపాడు చుందువు – కలకాలమును నీవు –నీ పాద సేవకుల – నీనేర్పురంజిల్ల ॥నీవు॥
3. నీవంటి యుపకారి యేడి – కర్త – నావంటి కడు దీనుఁ డేడి = జీవుల కును గల్గు – జీవంబు లిచ్చుచు – జీవాధారము లొసఁగి – జీవులఁ బ్రోచెడి ॥నీవు॥

4. నీవంటి ధనవంతుఁడేడి - యేసు - నా వంటి ధనహీనుఁ డేడి = ప్రోవులై యున్నవి - యీవులు నీయందు - నీవువాని నొసంగి నిరతంబు ననుఁ గావు ॥నీవు॥

- పులిపాక జగన్నాథము

బో :- మన తండ్రియైన దేవునినుండియు, ప్రభువైన యేసుక్రీస్తునుండియు కృపాసమాధానములు మీకు కలుగునుగాక (రోమా 1:3 ఫిలి, 1:2)

## ప్రసంగము

(ప్రసంగము ముగియగానే సభ నిలువబడియుండగా)

బో :- సమస్తజ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండునుగాక.

## అర్పణ సంకీర్తనలు

## I

***(రా-ఆంనదభైరవి. తా - ఆది)***

దేవా! నాయందు శుద్ధ హృదయము కలుగుజేయుము = నా అంతరంగ ములో స్థిరమైన మనస్సు నూతనముగా పుట్టించుము॥

నీసన్నిధానములోనుండి నన్ను త్రోసివేయకుము = నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము॥

నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము = సమ్మతిగల మనస్సు కలుగజేసి నున్న ధృఢపరుచుము॥ (దా.కీ. 51:10-12)

## II

***(రా - తోడి. తా - త్రిపుట)***

దహనమలి నీకు ననిష్టము, మరియు - దైవబలులు విరిగిన ఆత్మయే=నీ కిష్టము యెహోవదేవా! విరిగి నలిగిన యట్టి - హృదయం బలక్ష్యము జేబవు॥

నీకటాక్షముతో సీయోనుకునిపుడే – నెనరుతోడనుమేలుచేయుము = ప్రాకటంబుగను యెరుషలేమునకు ప్రాకరములులనుగట్టించుము॥ అంతట నీతియుక్తంబుతా బలులు యాగములు సర్వాంగహోమము=లెంతో యిష్టంబౌ బలిపీఠము మీద నెన్నో కోడెల జనులర్పింతురు.

**అర్పణలు**

## 583 కోఁత పండుగ

రా –శంకరాభరణము తా –ఆది

యెహోవ సన్నిధిని – నీ స్తోత్రగానముతో = మహోపకారునకు – మానుగ నర్పణ సమర్పించుఁడి ॥యెహోవ॥

1. ప్రభు వడుగు నర్పణలు – ప్రేమ కృతజ్ఞతలు = అభయ ప్రధానములు – విభునకు నియ్యుఁడు విరివిగను ॥యెహోవ॥
2. రిక్తహస్తములతో – రావలదు సన్నిధికి = భక్తవత్సలునకు – శక్తికొలఁది మీా రర్పించుఁడి ॥యెహోవ॥
3. శృంగారాలయ మీాలలోఁ – పొంగారఁ గట్టుటకు = బంగారు వెండి యును – బాగుగ నియ్యుఁడి ప్రభుపేర ॥యెహోవ॥
4. వరుమానములచేత – వాంఛింప వలదండి = గురు నాజ్ఞ చొప్పునను – విరివిగ హృదయము లర్పించుఁడి ॥యెహోవ॥
5. యెహోవ జనులారా – యియ్యుండి మనసార = యెహోవ యిచ్చి నది – యేసున కర్పణ చెల్లింతము ॥యెహోవ॥

– గుంజా వెంకటరత్నము

నీ కిచ్చు అర్పణలు – నీవే మాకిచ్చితివి = మాకున్న సకలాస్తుల్ – మా ప్రభువా యని నీవెకదా – నీకిచ్చు అర్పణలు – నీవిపుడు గైకొనుమా॥ (1దిన 29:14)

**ప్రార్థన**

# ముఖ్య ప్రార్ధన (1తిమో. 2:1-2)

బో:- ప్రార్ధింతుము

*( ఈ ప్రార్ధనలో అధికభాగము క్రీ.శ 1553 నుండి వాడుకలో ఉన్నది. )*

సర్వశక్తియు మిక్కిలి కనికరముగల కదేవా! మాప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రీ! నీవు మాకు అనుగ్రహించుచున్న మేళ్ళన్నిటి నిమిత్తమును మా యెడల నీకు గల కరుణా వాత్సల్యము నిమిత్తమును నిమ్ము స్తుతించుచున్నాము. ముఖ్యముగా నీ ప్రియ కుమారుని మా కొరకొచ్చి నందుకును, నీ చచిత్తుమును కృపను మాకు బయలు పరిచి నందుకును నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. మేము యథార్ధమైన మంచి హృదయముతో నీ వాక్యమును అంగీకరించి భద్రపరచుకొని సర్వదా మంచిఫలములను ఫలించునట్లు దాని మాలో నాటింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

రక్షణ కలిగించెడు నీ వాక్యమందలి పవిత్రమైన బోధయందును నీ సార్వత్రికసంఘమును కాపాడి యేలుమనియు, అందువలన నీయందు మాకు గల విశ్వాసము బలపడి సకల జనులయెడల మాలో ప్రేమవృద్ధి పొందునట్లను గ్రహింపుమనియు, మిగుల మనఃపూర్వకముగా నిన్ను వేడుకొనుచున్నాము.

నీవెలుగును, నీసత్యమును భూదిగంతములవరకు వ్యాపించేయుము. మాస్వజనులకును సకల జనాంగములకును నీ సువార్తను ప్రకటించుటకు నమ్మకమైన గురువులను బోధకులను ప్రతిష్టించి వారి పనులన్నిటియందును పరిచర్యలో వారిని నడిపించి కాపాడి అభివృద్ధి కలుగజేయుము.

సంఘమునకు సంబంధించిన శాస్త్రపాఠశాలలను, వేదపాఠశాలలను, ఇతర పాఠశాలలను, ఇతర పాఠశాలలను దీవించుము, వానినుండి వాక్యసేవయందును, రోగులకును, కష్టములలో నుండువారికిని, బీదలకును పరిచర్యచేయుట యందును జీవనోపాయము లన్నిటియందునునిన్ను సేవించు స్త్రీపురుషులు బయలు వెడలునట్లనుగ్రహింపుమని వినయముతో వేడుకొనుచున్నాము.

నీ వాక్యమును వెలుగు మా గృహములందు నిరంతరమును ప్రకాశింపనిమ్ము. పరిశుద్ధ బాప్తిస్మమునందు నీవు బిడ్డలతో చేసిన యొడంబడికను వారు నిలుపుకొనునట్లు సంఘపు బిడ్డలనందరిని కాపాడుము. వారిని నీయందు విశ్వాసముగల వారిని

గను, నీచిత్తముననుసరించి నడచుకొను వారిగను పెంచునట్లు తల్లిదండ్రులందరికి నీ కృప అనుగ్రహింపుము.

అధికారులందరికి ముఖ్యముగా రాష్ట్రపతికిని, ఉపరాష్ట్రపతికిని, ప్రధానమంత్రి కిని, గవర్నర్లకును, ముఖ్యమంత్రులకును, పార్లమెంటు సభాసభ్యులకును, విధాన సభల సభ్యులకును న్యాయాధిపతులు మొదలగువారి కందరికిని క్షేమమును ఆరోగ్యమును అనుగ్రహింపుము. వారు నీతి న్యాయములతో దివ్యమైన నీ చిత్త ప్రకారము యేలునట్లు వారికి నీ కృపననుగ్రహింపుము. శాంతిస్థాపనలో ప్రపంచ పాలకులు నాయకులు నీ చిత్త ప్రకారము చేయునట్లు వారికి నీజ్ఞానముననుగ్రహించి నడిపించుము.

యుక్తకాలమందు ఆవశ్యకమైన భూఫలములను మేమనుభవించునట్టు వానిని వృద్ధిపొందింపుము. జీవనోపాధికవసరమైన న్యాయమైన వృత్తులను, పవిత్రమైన విద్యను ఉపయోగకరమైన జ్ఞానమును వికిసంపజేసి ఆశీర్వదింపుము.

*(ఇచ్చట విశేష విజ్ఞాపనలు చేయవచ్చును)*

ఓ దేవా! ఈ మా మనవులను ఇంకను మేమే నీ చిత్తప్రకారము నిన్ను అడుగలవ సిన వాటిని నీతోను పరిశుద్ధాత్మతోను సదా యేకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ అద్వితీయకుమారుడును మా ప్రభువును రక్షకుడైనన యేసు క్రీస్తు యొక్క ఘోరశ్రమ మరణములను బట్టి మాకు దయచేయుమని నిన్ను వేడు కొనుచున్నాము.

## ప్రభువు నేర్పిన ప్రార్థన

***(మత్తయి 6:10-13; లూకా 11:12)***

***ఈ దిగువ ప్రార్థన చెప్పవలెను. లేదా పాడవలెను.***

పరలోకమందున్న మాతండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచుబడుగాక. నీరాజ్యము వచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక . మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చే సినవారిని మేము క్షమించుయున్న ప్రకారము మాయపరాధములను క్షిమించుము. శోధ నలోనికి తేక దుష్టునినుండి మమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమ యు నిరంతరము నీవియై యున్నవి ఆమేన్.

## దీవెన

***(సంఖ్యా 6:23-26)***

*బో:- ప్రభువు నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడుగాక! ప్రభువు నీకు తన సన్నిధి ప్రకాశింపజేసి నిన్ను కరుణించుగాక! ప్రభువు నీ మీద తన సన్నిధికాంతి నుదయింపజేసి నీకు సమాధానము కలుగ జేయునుగాక!*

సభ:-ఆ - మేన్, ఆ - మేన్, ఆమేన్.